# నమస్తే తెలంగాణ
## యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, సోమవారం 31 మార్చి 2025 | YADADRI BHUVANAGIRI


## ఈద్ ముబారక్

- నేడు ఈదుల్ ఫిత్ర్
- ఈద్‌గాహ్‌లలో ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు
- రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి



రామగిరి, మార్చి 30 : ముస్లింల నెలరోజుల రంజాన్ ఉపవాస దీక్షలు ఆదివారంతో ముగిశాయి. నెలవంక దర్శనలతో సోమవారం రంజాన్ పర్వదినాన్ని జరుపుకొనేందుకు మత పెద్దలు నిర్ణయించారు. దాంతో ముస్లింలు పండుగను ఘనంగా నిర్వహించుకేనేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఇప్పటికే ఈద్గాహ్‌లు, మసీదులను ప్రత్యేక ప్రార్థనలకు ముస్తాబు చేశారు. రంజాన్ సందర్భంగా మార్కెట్లు కిటకిటలాడాయి. దుస్తులు, డ్రైఫ్రూట్స్, సేమియా, తదితర వంటకాల సామగ్రి కొనుగోళ్లతో సందడిగా మారాయి. పండుగ సందర్భంగా ముస్లింలు తమకు ఉన్నదాంట్లో కొంత పేదలకు కొంత దానం చేస్తారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ముస్లింలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింల ఉపవాస దీక్షలు ఫలించాలని, అల్లాహ్ ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

# నిర్బంధాలు.. అరెస్టులు

## సీఎం పర్యటనపై బీఆర్ఎస్, సీపీఎం నాయకుల ముందస్తు అరెస్ట్

- మాజీ సర్పంచ్‌లను సైతం కట్టడి
- ఎక్కడికక్కడ అడ్డుకొని పోలీస్‌స్టేషన్లకు తరలింపు
- అడ్డగింతలు అప్రజాస్వామికమని నేతల మండిపాటు
- పండుగ పూట అరెస్ట్ చేయడంపై ఆగ్రహం

రామగిరి, మార్చి 30 : హుజూర్‌నగర్ నియోజవర్గంలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతిపక్ష నాయకులు, మాజీ సర్పంచ్‌లపై ప్రభుత్వం నిర్బంధకాండ ప్రదర్శించింది. బీఆర్ఎస్ నాయకులతో పాటు సీపీఎం, ఎమ్మార్పీఎస్ తదితర ప్రజా సంఘాలపై కక్షపూరితంగా వ్యవహరించింది. ఆదివారం ఉదయం నుంచే నేతల ఇండ్ల వద్దకు వెళ్లి పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌లకు తరలించారు. కొండమల్లేపల్లి, గుర్రంపోడ్‌లో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. హాలియా, చిట్యాల, దామరచర్లలో బీఆర్ఎస్, సీపీఎం నాయకులను.. త్రిపురారంలో మాజీ సర్పంచ్‌లను.. తిరుమలగిరి సాగర్‌లో బీఆర్ఎస్‌వీ, దళిత సంఘాల నాయకులను.. కట్టంగూర్‌లో సీపీఎం, ఎమ్మార్పీఎస్ నాయకులను.. హుజూర్‌నగర్, మఠంపల్లి, పాలకవీడు, గరిడేపల్లి, అనంతగిరి, మద్దిరాల, అర్వపల్లిలో బీఆర్ఎస్, సీపీఎం నేతలను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌లకు తరలించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా, పెండింగ్ బిల్లులు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నదని, ప్రశ్నించిన వారిపై దాడులు చేస్తున్నదని నేతలు మండిపడ్డారు. ఉగాది, రంజాన్ పండుగల సందర్భంగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌లకు తరలించడానికి పలువురు నేతలు మండిపడ్డారు. నిర్బంధాలు, అరెస్టులతో ప్రభుత్వం పాలన సాగించలేదని, హామీల అమలు, ప్రజా సమస్యల పరిష్కారంపై సర్కారు దృష్టి సారించాలని సూచించారు.



గుర్రంపోడ్ : బీఆర్ఎస్, ప్రజా సంఘాల నాయకులను అరెస్టు చేసిన పోలీసులు



అర్వపల్లి : బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసిన పోలీసులు



మఠంపల్లి : పోలీసుల అదుపులో బీఆర్ఎస్ నాయకులు

## ఉగాది సంబురం

### విశ్వావసు నామ సంవత్సరానికి ఘన స్వాగతం

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు.. పంచాంగ పఠనం
- వేడుకల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు
- మోత్కూరులో బోనాలు, ఫలహారం ఎడ్లబండ్ల ఊరేగింపు



సూర్యాపేటలోని క్యాంపు కార్యాలయంలో ఉగాది పచ్చడి తయారు చేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

రామగిరి/సూర్యాపేట టౌన్/మోత్కూరు, మార్చి 30 : తెలుగు నూతన సంవత్సం ఉగాది పర్వదిన వేడుకలను ఆదివారం సంబురంగా నిర్వహించుకున్నారు. విశ్వావసు నామ సంవత్సరానికి ఘన స్వాగతం పలికారు. మామిడి, వేప తోరణాలు కట్టి ఆలయాలతోపాటు ప్రతి ఇంట్లోనూ వేడుకలు జరుపుకొన్నారు. ప్రత్యేక పూజలతో తమ ఇష్ట దైవాలను కొలిచారు. ఉగాది పచ్చడితోపాటు స్వీట్లు తదితర వంటకాలు చేసి కుటుంబ సమేతంగా ఆస్వాదించారు. ఆలయాల్లో అర్చకులు పంచాంగ శ్రవణం చేయగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ భవిష్యత్ సమాచారాన్ని తెలుసుకున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉగాది వేడుకల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. సూర్యాపేటలోని క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. జగదీశ్‌రెడ్డి స్వయంగా ఉగాది పచ్చడి తయారు చేసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు నాయకులు, జనం పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మోత్కూరు ఉగాది పండుగ సందర్భంగా గ్రామస్తులు ముత్యాలమ్మకు బోనాలు సమర్పించారు. ఫలహారం ఎడ్లబండ్ల ఊరేగింపు నిర్వహించారు.



మోత్కూరులో ఎడ్లబండ్ల ప్రదర్శన

## మత సామరస్యానికి ప్రతీక రంజాన్

### ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి



యాదగిరిగుట్ట : మాసాయిపేటలో ముస్లింలకు రంజాన్ తోఫాను అందజేస్తున్న ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, మార్చి30 : ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని మాసాయిపేటలో మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నేత బుడిగె గౌతమీనర్సింగరావు సమకూర్చిన రంజాన్ తోఫాను ఆయన పంపిణీ చేశారు. ఇందులో భాగంగా సుమారు 110 ముస్లిం కుటుంబాలకు నిత్యావసర సరుకులు, వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో పాటించే ఉపవాస దీక్షలు ఫలించాలని అన్నారు. అల్లాహ్ ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరారు. అనంతరం ముస్లింలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యాదగిరిగుట్ట మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రామిరెడ్డి, నాయకుడు వంటేరు సురేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బస్సులన్నీ సీఎం సభకు

- పండుగ పూట ప్రయాణికుల ఇబ్బందులు
- నల్లగొండ రీజియన్ నుంచి వెళ్లిన 300 ఆర్టీసీ బస్సులు
- గంటల తరబడి బస్టాండ్లలో నిరీక్షించిన జనం



ప్రయాణికులే తప్ప బస్సులు లేని నల్లగొండ బస్టాండ్

నల్లగొండ సిటీ, మార్చి 30 : ఉగాది, రంజాన్ పండుగల వేళ పట్టణాలతో పాటు వివిధ ప్రాంతాల్లో ఉండే జనం సొంతూళ్లకు బయల్దేరారు. కానీ బస్సులు లేక ఆదివారం గంటల తరబడి బస్టాండ్లలో వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఉగాది సందర్భంగా హుజూర్‌నగర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పేదలకు సన్నబియ్యం పథకాన్ని ప్రారంభిస్తుండగా ఆ సభకు ఆర్టీసీ బస్సులన్నీ అక్కడికి వెళ్లాయి. ఉమ్మడి నల్లగొండ వ్యాప్తంగా 7 డిపోల్లో సుమారు 300 వెళ్లినట్లు సమాచారం. దాంతో హైదరాబాద్ తదితర దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్సుల కోసం సుమారు మూడు నుంచి నాలుగు గంటలు వేచి చూడాల్సిన పరిస్థితి వచ్చింది. ఏ బస్టాండ్‌లో చూసినా ప్రయాణికులు ఫుల్‌గా ఉండగా బస్సులు లేక బోసిపోయాయి. గంటల తరబడి వేచి చూసిన కొంత మంది జనం బస్సులు రాక ప్రైవేట్ వాహనాల్లో వెళ్లారు. వచ్చిన బస్సులు నిండుగా ఉండడంతో పిల్లలు, పెద్దలు సైతం నిలబడి ప్రయాణించారు. సాధారణ రోజుల్లో జనం కొంత తక్కువగా ఉన్నా, పండుల పూట ఇలా బస్సులు లేకుండా చేయడంపై ప్రజలు ప్రభుత్వంపై మండిపడుతున్నారు.

### సగం బస్సులు సభకు వేశాం : జానిరెడ్డి, ఆర్‌టీసీ ఆర్‌ఎం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 640 ఆర్టీసీ బస్సులు ఉండగా సీఎం రేవంత్ రెడ్డి సభకు ఆదివారం 300 బస్సులను పంపించాం. ఉన్న బస్సులను రద్దీ ఎక్కువగా రూట్లలో నడుపుతున్నాం. పండుగకు ఒక్కరోజు ముందే ప్రయాణికులు తమ సొంత ఊర్లకు చేరుకున్నారు. దీంతో పండుగ నాడు రద్దీ ఏమీ లేదు. ప్రయాణికులకు ఇబ్బంది ఏర్పడకుండా ఉన్న బస్సులను నడిపిస్తున్నాం.

## సీఎం రేవంత్ రెడ్డి పర్యటనపై దివ్యాంగుల నిరసన

### హామీలు అమలు చేయకపోవడంపై మండిపాటు



చివ్వెంల : గుంపులలో నల్లబెలూన్లతో నిరసన వ్యక్తం చేస్తున్న దివ్యాంగులు

చివ్వెంల, మార్చి 30 : అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంపై దివ్యాంగులు నిరసన వ్యక్తం చేశారు. దివ్యాంగులను చిన్న చూపు చూస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాపాలన పేరుతో సన్న బియ్యం పంపిణీ పథకం ప్రాంభించడానికి హుజూర్‌నగర్‌కు రావడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. చివ్వెంల మండలం గుంపుల గ్రామంలో ఆదివారం సీఎం రేవంత్ రెడ్డి పర్యటనకు వ్యతిరేకంగా భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నల్ల బెలూన్లతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి దివ్యాంగుల సంక్షేమాన్ని విస్మరిస్తూ వివక్ష ప్రదర్శిస్తున్నారని అన్నారు. అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్నా దివ్యాంగులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని తెలిపారు. ప్రజాస్వామ్య బద్ధంగా, శాంతియుతంగా ఉద్యమాలు చేస్తున్న తమపై అక్రమ కేసులు పెట్టడం సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొల్లూరి ఈదయ్యబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు మున్న మధు, పబ్బు వెంకటమ్మ, ఆదయ్య, ముత్తమ్మ, రాములమ్మ, సత్యనారాయణ, సక్కుబాయి, పద్మ, లక్ష్మి, లతీఫ్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

## సన్నబియ్యం పథకమైనా కొనసాగేనా..?

### రుణమాఫీ, రైతు భరోసా పూర్తి చేశామన్న సీఎం రేవంత్

- హుజూర్‌నగర్ సభలో పచ్చి అబద్ధాలు
- అసలే ఖజానా ఖాళీ అంటున్న క్రమంలో సన్న బియ్యానికి నిధులు ఎలా తెస్తారు
- అసంతృప్తితో ఉన్న జనానికి అనుమానాలు



హుజూర్‌నగర్ సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

సూర్యాపేట, మార్చి 30 (నమస్తే తెలంగాణ) : హుజూర్‌నగర్‌లో సన్నబియ్యం పథకాన్ని అట్టహాసంగా ప్రారంభించినప్పటికీ ఈ స్కీం కొనసాగేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పైగా ముఖ్యమంత్రి తన ప్రసంగంలో రైతులకు ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేసేశాం.. రైతు భరోసా డబ్బులు ఇచ్చేశాం అంటూ పచ్చి అబద్ధాలు అడడం పట్ల సన్నబియ్యం పథకం అమలు విషయంలో అనుమానాలు బలపడుతున్నాయి. ఒక్క సూర్యాపేట జిల్లా వరకే పరిశీలిస్తే వచ్చే నాలుగు నెలల వరకు సరిపడా బియ్యం ఉన్నాయని అధికారులు చెబుతుండగా రాష్ట్రంలో కూడా అదే పరిస్థితి ఉంటుందనేది అంచనా. ఒకవేళ ప్రభుత్వం సన్నబియ్యం కొనుగోలు చేసి రేషన్ కార్డు దారులకు ఇవ్వాలంటే ఇప్పటికే ఖజానా ఖాళీ అంటూ పదే పదే చెబుతున్న రేవంత్‌రెడ్డి మరి అత్యధిక ధరలు ఉండే సన్నాలను ఎలా కొంటారు అనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది.

రాష్ట్రంలో గత సీజన్ వరకు ప్రభుత్వం దొడ్డు రకం వడ్లను కొనుగోలు చేయగా సన్నాలకు అధిక ధరలు ఉండడంతో రైతులు వాటిని బహిరంగ మార్కెట్‌లోనే విక్రయించుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యానికి క్వింటాకు రూ.500ల బోనస్ ఇస్తామని ఇచ్చిన హామీను తుంగలో తొక్కి కేవలం సన్నాలకు మాత్రమే ఇచ్చింది. సన్న వడ్లను పండించిన రైతులు మెజారిటీ ధాన్యాన్ని బహిరంగ మార్కెట్‌లో విక్రయించుకోగా కొంత మేర మాత్రమే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకున్నారు. వాటికి సంబంధించి సూర్యాపేట జిల్లాలో రైతులకు ఇంకా రూ.20 కోట్లకు పైనే బోనస్ బకాయి ఉండడం గమనార్హం. ఇదిలా ఉంటే ఈ సీజన్‌లో రైతులు జిల్లా వ్యాప్తంగా 55 శాతానికి మించి సన్నధాన్యం సాగు చేయలేదు. యాసంగిలో వాతావరణం అనుకూలించదని దొడ్డురకమే సాగు చేస్తుంటారు. పైగా ఇప్పటికే వరి కోతలు జోరుగా సాగుతుండగా ఇప్పటి వరకు ప్రభుత్వ పరంగా కొనుగోలు చేసేందుకు తూతూ మంత్రంగా కూడా చర్యలు చేపట్టకపోవడంతో మిల్లులకు తరలిస్తున్నారు. దీంతో ప్రభుత్వం గత సీజన్‌లో కొనుగోలు చేసిన సన్నధాన్యం సీఎంఆర్ ద్వారా రైస్ తీసుకోగా ఈ సారి ఉలుకూపలుకూ లేకపోవడం పట్ల సన్నబియ్యం ఎలా సమీకరిస్తారనేది ప్రశ్నార్థకమే.

### ఖజానా ఖాళీ అంటున్నారు... సన్న బియ్యం ఎలా?

ముఖ్యమంత్రి నుంచి మొదలు కుంటే మంత్రులు నోరు తెరిస్తే రాష్ట్ర ఖజానా ఖాళీగా ఉందని చెబుతున్న విషయం విదితమే. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అరకొరగా కూడా అమలు చేయకపోగా గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన పథకాలను కూడా కొనసాగించలేని దుస్థితిలో పాలన ఉంది. పైగా రైతులకు రుణమాఫీ చేశాం... రైతు భరోసా ఇచ్చామంటూ పదేపదే అబద్ధాలు చెబుతుండడం పట్ల దాదాపు 60శాతం మంది రైతులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. దీంతో పాటు కాళేశ్వరం జలాలు రాక పంటలు ఎండిపోతుంటే ఎండలకు ఎండిపోతున్నాయని సీఎం అనడం... అలాగే అసలు కాళేశ్వరం జలాలే రాలేదు... గతంలో వచ్చినవి శ్రీరాంసాగర్ నీళ్లని పచ్చి అబద్ధాలు చెబుతుండడం పట్ల సన్నబియ్యం పథకం కూడా హుళక్కే అవుతుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### సన్నాలు కొనాలంటే నెలకు రూ.2,858 కోట్లు కావాలి..

పస్తుతం ప్రభుత్వం వద్ద సన్న బియ్యం నాలుగు నెలల వరకు సరిపడే అవకాశం ఉన్నట్లు అధికారుల ద్వారా తెలుస్తుండగా తదనంతరం ఈ పథకాన్ని అమలు చేయాలంటే నెలనెలా రూ.2,858 వేల కోట్ల అదనపు భారం పడుతుందని స్వయానా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి హుజూర్‌నగర్ ప్రసంగంలో పేర్కొన్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో సన్న బియ్యం క్వింటాకు రూ.4,500 నుంచి 6వేల వరకు ఉండగా ఖజానా ఖాళీగా ఉన్నదంటున్న ప్రభుత్వం నెలనెలా ఈ నిధులు ఎలా సమకూర్చనుందో దేవుడికే తెలియాలి.



నార్కట్‌పల్లి మండలం వెంకటేశ్వర్ల బావి గ్రామ శివారులో ఎండిన వరి పంటలో పశువులను మేపుతున్న రైతు

## నీళ్లు లేక పశువులకు మేతగా..

- కరువుకోరల్లో నార్కట్‌పల్లి మండలం
- అడుగంటిన భూగర్భ జలాలు.. చుక్కనీరు లేని బోర్లు
- ఎండిన పొట్టకొచ్చిన వరిపొలాలు

నార్కట్‌పల్లి, మార్చి 29 : రోజురోజుకు ఎండలు ముదురుతుండటంలో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. పంటలకు నీళ్లు అందక పోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. నార్కట్‌పల్లి మండలం నీళ్లు లేక కరువు కోరల్లో చిక్కుకుంది. మండలంలోని నెమ్మాని, జువ్విగూడెం, చిన్నతుమ్మల గూడెం, వెంకటేశ్వర్ల బావి గ్రామాల్లో వరి పంటలకు నీరు అందక పంటలు ఎండి పోతున్నాయి. దీంతో చేసేది ఏమీ లేక బర్రెలను, గొర్రెలను మేపుతున్నారు. గతంలో పుష్కలంగా నీళ్లు ఉండడంతో రెండు పంటలకు సాగు చేసుకోగా ఇప్పుడు యాసంగికి నీళ్లు దొరకని పరిస్థితి నెలకొంది. మండలంలోని 20వేల ఎకరాల వరకు వరి సాగు చేయగా ఇప్పటికే చాలా ఎకరాలు నీళ్లు లేక ఎండిపోయాయి. అప్పులు చేసిన పంటలు సాగు చేశామని, ఇప్పుడు వాటిని ఎలా తీర్చాలని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.





